రోడ్డుపై ఐదు నెలల పిండం

కూసుమంచి, జూన్ 28: మానవత్వం మంటగలిచిన హృదయ విదారక ఘటన ఒకటి కూసుమంచి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఐదు నెలల వయసున్న ఓ పిండం మండలంలోని నాయకన్‌గూడెంలో స్థానికులకు కన్పించింది. పంచాయతీ కార్యదర్శి తులసీరాం కథనం ప్రకారం.. కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం – కోదాడ మార్గంలో కుంట సమీపంలో సుమారు ఐదు నెలల పిండం ఉంది. అటుగా వెళ్తున్న స్థానికులు దానిని గమనించి పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. పంచాయతీ గుమస్తా సతీశ్ అక్కడికి వెళ్లి చూశారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు పంచానామా చేసి పోలీసులు పోస్టుమార్టానికి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించండి: ఎస్ఈ

మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్

కూసుమంచి, జూన్ 28: వినియోగదారులు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ సూచించారు. అలాగే, క్కడ విద్యుత్ సమస్యలు వచ్చినా తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. కూసుమంచిలో శుక్రవారం జరిగిన విద్యుత్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రజావాణికి మంచి స్పందన వస్తోందన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నాగేశ్వరరావు, కోక్యానాయక్, వెంకన్నబాబు, గ్రేసీ సుజన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్పీ కాలువ పనులను పరిశీలించిన ఈఈ

పనులను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

కూసుమంచి, జూన్ 28: కూసుమంచి మండలంలోని ఎస్ఆర్ఎస్పీ కాలువ పనులను ఇరిగేషన్ ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. మండలంలోని గంగబండతండా, రావిచెట్లుతండా, గుర్వాయిగూడెం, జుర్ఖుల్‌రావుపేట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న శ్రీరాంసాగర్ కాలువ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున కాలువల్లో పూడికలు లేకుండా శుభ్రం చేస్తున్నామని అన్నారు. అలాగే, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డీఈ రత్నకుమారి, సిబ్బంది కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీలోంచి 200 లీటర్ల డీజిల్ చోరీ

తిరుమలాయపాలెం, జూన్ 28: మండలంలోని వెదుళ్లచెరువు క్రాస్‌రోడ్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న లారీ లోంచి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్‌ను చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు చెందిన లారీని బంక్ ఎదురుగా రోడ్డు పక్కన ఉంచారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు లారీ ట్యాంకర్ నుంచి పైపు ద్వారా లాగి రూ.19 వేల విలువైన 200 లీటర్ల డీజిల్‌ను తీసుకెళ్లారు. డీజిల్ చోరీ దృశ్యాలు సీసీటీవీ పుటేజీల్లో రికార్డయ్యాయి. బంక్ సూపర్‌వైజర్ జగన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్త చట్టాలపై న్యాయవాదులకు నేడు తరగతులు

ఖమ్మం లీగల్, జూన్ 28: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలపై న్యాయవాదులకు అవగాహన తరగతులను శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్‌లోగల డీపీఆర్‌సీ బిల్డింగ్‌లో నిర్వహించనున్నట్లు ఇండియన్ లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులను వరంగల్ సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి బోధిస్తారని పేర్కొన్నారు. తరగతులు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. న్యాయవాదులు హాజరుకావాలని కోరారు.

రైతుల కోసమే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు

ఖమ్మం లీగల్, జూన్ 28: రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకే ఖమ్మం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా జడ్జి రాజగోపాల్ తెలిపారు. ఈ క్లినిక్‌లలో సేవలందిస్తున్న పారా లీగల్ వలంటీర్లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. రైతులకు సంబంధించిన చట్టాలు, న్యాయపరమైన అంశాలపై వలంటీర్లకు అవగాహన ఉండాలన్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రతి మంగళ, శుక్రవారాల్లో పనిచేస్తున్నట్లు చెప్పారు.

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు నివాళులు


ఖమ్మంలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కర్నాటి కృష్ణ

ఖమ్మం/ మధిర/ సత్తుపల్లి, జూన్ 28: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103వ జయంతి వేడుకలను వివిధ సంఘాలు, పార్టీల నాయకులు శుక్రవారం ఖమ్మంలో నిర్వహించారు. లకారం ట్యాంక్ బండ్ వద్ద పీవీ విగ్రహానికి మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, ఆళ్ల నిరీష తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలో పీవీ విగ్రహానికి రాజ్యసభలో బీఆర్ఎస్ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పూలమాల వేసి నివాళి అర్పించారు. మధిర, సత్తుపల్లి మండలాల్లోనూ ఆయా పార్టీలు, సంఘాల నాయకులు పీవీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: ఎంపీవో

మాట్లాడుతున్న ఎంపీవో రాజారావు

ఖమ్మం రూరల్, జూన్ 28: మండల కేంద్రమైన పెద్దతండా పంచాయతీలో అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని ఎంపీవో రాజారావు తెలిపారు. పెద్దతండా పంచాయతీలో కార్యదర్శి ఉమ అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో దోమల బెడద ఎక్కువగా ఉండే ప్రమాదం ఉన్నందున పారిశుధ్య కార్యాక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం డ్రైనేజీల నిర్మాణాలు, ఇళ్ల నంబర్ల కేటాయింపు, సీసీ రోడ్ల నిర్మాణం, ఇళ్ల మధ్య మధ్య ఉండే ఖాళీ స్థలాల్లో మురుగునీటి తొలగింపు వంటి అంశాల గురించి చర్చించి అధికారులకు సూచనలు చేశారు. అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ఎర్రుపాలెం, జూన్ 28: మండలంలోని చొప్పకట్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సుదర్శన్ ఫౌండేషన్ అధినేత ఫాస్టర్ జగదీష్‌పాల్ ఆధ్వర్యంలో 30 మంది పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేశారు. వీటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారుపల్లి రాజారావు, ఉపాధ్యాయులు ఎన్.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్

పాలేరు తీరంలో యోగా ప్రదర్శన చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కూసుమంచి, జూన్ 28: క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్‌సీసీ నిలుస్తోందని సీపీ సునీల్‌దత్ పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలకు, నాయకత్వ లక్షణాలకు ఇది మంచి మార్గాన్ని చూపిస్తుందని అన్నారు. పాలేరు నవోదయలో ఈ నెల 19న మొదలైన వరంగల్ జీపీ కంబైడర్ వార్షిక నాలుగో శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి 598 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు 10 రోజులపాటు వివిధ అంశాల్లో నిపుణులు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. తెలంగాణ ఎన్‌సీసీ క్యాంపు కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా, సైబర్ క్రైమ్, సఖీ, షీ టీం, ప్రకృతి విపత్తులు, వివిధ క్రీడల వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. శుక్రవారం క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జల్లేపల్లికి ఉన్నతాధికారులు

- విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు
- ఆసుపత్రికి జ్వరపీడితుల తరలింపు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

గాబుల్లో ఉన్న నిల్వ నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

తిరుమలాయపాలెం, జూన్ 28: మండలంలోని జల్లేపల్లి గ్రామాన్ని జిల్లా వైద్యాధికారి మాలతి, డీఎల్‌పీవో నాగలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు శుక్రవారం పరిశీలించారు. విషజ్వరాలతో జల్లేపల్లి గ్రామస్తులు మంచం పట్టిన అంశంపై 'పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం' శీర్షికన 'నమస్తే తెలంగాణ' ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో పర్యటించారు. ప్రజలు విషజ్వరాల బారిన పడడానికి గల కారణాలను పరిశీలించారు. పారిశుధ్యలోపమే ప్రధాన కారణమని తేల్చారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం జ్వర పీడితులను ఆరోగ్య ఉపకేంద్రానికి తరలించి వైద్య సేవలు అందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ కుంటుపడిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న అధికారులకు వివరించారు. అధికారులు శేషాద్రి, ఓంప్రకాశ్, రంజిత్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

హాజరుకాని అధికారులు, ప్రజాప్రతినిధులు

సభ్యులు హాజరుకాక ఖాళీ ఉన్న కుర్చీలు

బోనకల్లు, జూన్ 28: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో తూతూ మంత్రంగా సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ కంకనాల సౌభాగ్యం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశానికి మండలంలోని అధికారులు ప్రగతి నివేదికలను తీసుకొని హాజరుకావాల్సి ఉంది. కానీ కేవలం 10 శాఖల అధికారులు మాత్రమే హాజరుకావడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఎంపీపీ కంకనాల సౌభాగ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘాల అధ్యక్షులు పూర్తిస్థాయిలో హాజరుకాక పోవడంతో నామమాత్రంగా సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశంలో బోనకల్లు ఎంపీటీసీ రమేశ్ మాట్లాడుతూ రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్నప్పటికీ రేషన్‌డీలర్లు వారికి రావాల్సినటువంటి బియ్యాన్ని ఇవ్వడం లేదని తహసీల్దార్‌కు తెలిపారు. తహసీల్దార్ పున్నంచందర్ మాట్లాడుతూ.. అలాంటి వారి వివరాలు తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి రావాలని, వారి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజు, పంచాయతీరాజ్, ఆరోగ్య, ఈజీఎస్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'6న చలో రాజ్‌భవన్'

ఖమ్మం రూరల్, జూన్ 28: పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జూలై 6న నిర్వహించనున్న చలో రాజ్‌భవన్ కార్యక్రమాలన్ని జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని కాచిరాజుగూడెంలో శుక్రవారం ఏర్పాటుచేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు తిమ్మిడి హన్మంతరావు, వెంకయ్య, మల్లీదు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

ఎర్రుపాలెం, జూన్ 28: మండలంలోని రాజుపాలెం పీఏసీఎస్‌లో సభ్యురాలైన పొట్టేటి భారతమ్మ ఇటీవల మృతిచెందారు. ఆమెకు మంజూరైన రూ.50 వేలు బీమా నగదును శుక్రవారం డీసీసీబీ బ్యాంకులో ఆమె భర్త లక్ష్మారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెన్నపూస కృష్ణారెడ్డి, డీసీసీ బ్రాంచ్ మేనేజర్ ఎన్.దివ్య, బ్రాంచ్ సూపర్‌వైజర్ సుధాకర్, రాజుపాలెం సంఘ సెక్రటరీ బొగ్గుల శివారెడ్డి, కర్నాటి సుధాకర్‌రెడ్డి, సంఘ సిబ్బంది కుంపటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మీనవోలు ఏబీపీఎం పదవీ విరమణ

ఎర్రుపాలెం, జూన్ 28: మండలంలోని మీనవోలు బ్రాంచ్ ఆఫీస్‌లో ఏబీపీఎంగా పనిచేస్తున్న చెరుకూరి కోటేశ్వరరావు పదవీ విరమణ పొందడంతో ఆయనను ఎర్రుపాలెం పోస్టాఫీసులో పోస్టల్ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను ప్రశంసించారు.

'విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి'

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

తిరుమలాయపాలెం, జూన్ 28: ఉన్నత విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చునని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్.. విద్యార్థులు ఉద్బోధించారు. అలాగే విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తన సోదరుడు తాతా విశ్వేశ్వరావు కుమారుడు స్వర్గీయ తాతా నిఖిల్‌చౌదరి జ్ఞాపకార్థంగా మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్కూల్ బ్యాగులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పిండిప్రోలు జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఏటా రూ.50 వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తాతా కుటుంబ సభ్యులు, పాఠశాల బాధ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనతో ఆర్థిక అంతరాల పెంపు: సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత నారాయణ

కమాన్‌బజార్, జూన్ 28: కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశంలోఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. నారాయణ మాట్లాడుతూ.. పేదరికం గణనీయంగా పెరుగుతున్న దేశాల్లో మనది కూడా ఒకటని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ బలం గణనీయంగా తగ్గడానికి.. ప్రజా వ్యతిరేకతే కారణమని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటను పరిశీలించిన మంత్రి తుమ్మల

పామాయిల్ గెలలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్, జూన్ 28: మండలంలోని పాకాలగూడెంలో పామాయిల్ తోటలను శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం మంత్రి వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ యాస్మిన్‌బాషా పాల్గొన్నారు.

ఐఐటీలో గిరిజన గురుకుల విద్యార్థులకు సీట్లు

ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పీవో

కొణిజర్ల, జూన్ 28: స్థానిక గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదివిన విద్యార్థులు ముంబై, బిలాయి ఐఐటీల్లో సీట్లు సాధించారు. ఎం.లిఖిత (ఎమ్మెస్సీ ఫిజిక్స్ ఐఐటీ ముంబై), బీ.శ్రావణి (ఎమ్మెస్సీ ఫిజిక్స్– ఐఐటీ ముంబై), ఎస్.వాసవి (ఎమ్మెస్సీ కెమిస్ట్రీ –ఐఐటీ బిలాయి) సీట్లు సాధించారు. ఈ విద్యార్థులను భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. గురుకుల కళాశాల బాధ్యులు టీవీ రాజు, మానస తదితరులు పాల్గొన్నారు.

జేటీసీపై దాడి.. రవాణా శాఖ కార్యాలయాల్లో పెన్‌డౌన్..

ఖమ్మం ఆర్‌టీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు

రఘునాథపాలెం/ సత్తుపల్లి టౌన్/ వైరా టౌన్, జూన్ 28: జిల్లా రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయం (ఆర్టీవో) ఎదుట అధికారులు, సిబ్బంది శుక్రవారం పెన్ డౌన్ చేశారు. హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్‌పై గురువారం ఆటో యూనియన్ జేఏసీ నాయకుడు మహ్మద్ అమానుల్లాఖాన్ దాడి చేయడాన్ని ఖండిస్తూ జిల్లా రవాణా శాఖ అధికారి ఆఫ్రిన్ సిద్దిఖీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ వెంకటరమణ, ఉద్యోగులు సుధాకర్, సంతోష్, రత్నరాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు. సత్తుపల్లి, వైరాల్లో రవాణా శాఖ అధికారులు యోగేశ్వరజాదవ్, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి టౌన్‌లో..

వైరా టౌన్‌లో..

వైద్యశాలలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఖమ్మం సిటీ, జూన్ 28: జిల్లాలోని అన్ని వైద్యశాలలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశాలలో ధరల పట్టిక, సిబ్బంది వివరాలు, సేవలను కచ్చితంగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్లకు తప్పనిసరిగా అనుమతి ఉండాలని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ప్రదర్శన

ఖమ్మంలో ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

కమాన్‌బజార్/ సత్తుపల్లి టౌన్, జూన్ 28: బొగ్గు గనులకు వేలం పాటను ఆపాలని, వాటిని సింగరేణికి నేరుగా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి సరిత క్లినిక్ సెంటర్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో నున్నా నాగేశ్వరరావు (జిల్లా కార్యదర్శి), యర్రాశ్రీకాంత్, వై.విక్రం, సింగరేణి బొగ్గు గని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు తదితరులు పాల్గొన్నారు. సత్తుపల్లిలోనూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.

'రైతుభరోసా అమలుకు సూచనలివ్వండి'

కారేపల్లి, జూన్ 28: రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పకడ్బందీగా అమలు కోసం రైతుల సలహాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయించిందని కారేపల్లి సొసైటీ అధ్యక్షుడు దుగ్గినేని శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి బొల్లు హనుమంతరావు తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు దారావత్ మంగీలాల్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుడిపై కేసు నమోదు

కారేపల్లి, జూన్ 28: అధిక మోతాదులో యాంటీబయోటిక్స్ ఇచ్చి వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి కారణమైన ఆర్ఎంపీ వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని గాదేపాడు గ్రామానికి చెందిన సైఫ్‌జాన్ కొంతకాలం క్రితం జ్వరం రావడంతో గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అన్వర్ వద్ద ప్రథమ చికిత్స చేయించుకున్నారు. సదరు ఆర్ఎంపీ వైద్యుడు బాధిత వ్యక్తికి అధిక మోతాదులో ఆంటీబయోటిక్స్ ఇవ్వడంతో బీపీ డౌన్ అయి మూర్ఛపోయాడు. దీంతో ఆర్ఎంపీ తన సొంత వాహనంలో ఖమ్మంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించి ఖర్చులు మొత్తం తానే చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. అనంతరం పట్టించుకోకపోవడంతో ఆర్ఎంపీ వైద్యుడు అన్వర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు సైఫ్‌జాన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై రాజారాం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'

వైద్య శిబిరంలో సూచనలిస్తున్న డాక్టర్ కిరణ్

పెనుబల్లి, జూన్ 28: ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సూరయ్యబంజరతండాలో డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య, పంచాయతీ సిబ్బందితో కలిసి డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి ఇంటి లోపల, వీధుల్లో నీటి నిల్వ లేకుండా చూడాలని, అవసరమైన చోట ఆయిల్‌బాల్స్ వేసి, వీధులలో బ్లీచింగ్ చల్లించారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

చిరు జల్లులతో కరివేద సాగు ఆశాజనకం

పెనుబల్లి, జూన్ 28: అడపాదడపా చిరు జల్లులతో కరివేద సాగు ఆశాజనకంగా కనిపిస్తున్నది. కరివేద సాగు చేస్తున్న రైతులు ఈ చిరుజల్లుల కోసం కొన్ని రోజులుగా ఎదురు చూస్తుండగా మూడు రోజుల నుంచి చిరుజల్లులు పడటంతో రైతులు పొలాల వెంట పరుగులు పెడుతున్నారు. వడ్ల మొలకెత్తిన పొలాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జేవీఆర్ ఓసీలో సన్మాన కార్యక్రమం

సత్తుపల్లి టౌన్, జూన్ 28: సత్తుపల్లి జలగం వెంగళరావు సింగరేణి ఉపరితల గనిలో సెక్యూరిటీ జమేదార్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసుతన్న అమర్లపూడి దేవదానం, బదిలీపై ఇల్లెందు గనికి వెళ్తున్న బాణోత్ రాందాస్‌ను శుక్రవారం ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు. కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణలోను, సింగరేణి ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ఇరువురు ఎనలేని కృషి చేశారన్నారు.

పాఠశాలకు వంటసామగ్రి వితరణ

చింతకాని, జూన్ 28 : మండల పరిధిలోని రామకృష్ణాపురం ఉన్నత పాఠశాలకు కన్నెబోయిన లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్ కన్నెబోయిన సీతారామయ్య ఆధ్వర్యంలో రూ.12వేలు విలువైన వంట సామగ్రిని శుక్రవారం వితరణగా అందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం గర్వకారణమని పీజీహెచ్ఎం బీరెల్లి రమాదేవి పేర్కొన్నారు. కార్యదర్శి డేగల సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘం రైతులకు అవగాహన

మధిర రూరల్, జూన్ 28: మండలంలోని సిద్దినేనిగూడెం సహకార సంఘం రైతులకు సహకార విద్య నిర్వాహణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయ సహకార శిక్షణ కేంద్రం లెక్చరర్ పొనగంటి రాజయ్య రైతుకు సహకార సంఘం విధి విధానాలు, వారి బాధ్యతలు, సం